సాక్షి
పశ్చిమగోదావరి
గురువారం । 11 । సెప్టెంబర్ । 2025



'లంపీ'తో అప్రమత్తం

పశువులకు లంపీ స్కిన్ వ్యాపిస్తుండటంతో శ్రీవారి దేవస్థానం అధికారులు అప్రమత్తమయ్యారు. గోదానం, గోదత్తత పథకాలను తాత్కాలికంగా నిలుపుదల చేశారు. 8లో ▸



ఆధిపత్యం కోసమే హత్య

ఏలూరు రూరల్ కొమడవోలు ఇందిరమ్మ కాలనీలో ఇటీవల జరిగిన హత్య ఆధిపత్యం కోసమే జరిగిందని పోలీసులు తెలిపారు. ఈ కేసులో ఆరుగురిని అరెస్టు చేశారు. 8లో ▸



మన్యంలో ప్రకృతి సేద్యం

మన్యంలో ప్రకృతి వ్యవసాయంపై గిరిజన రైతులకు అవగాహన కలిగిస్తున్నారు. ఖరీఫ్‌లో 10వేల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేపట్టినట్లు అధికారులు చెబుతున్నారు. 8లో ▸

న్యూస్‌రీల్

ఐటీ విభాగం సంయుక్త కార్యదర్శులుగా నియామకం



రోణంకి శ్రీనివాసు



ఈలపాటి కిషోర్‌బాబు

పాలకొల్లు సెంట్రల్: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఐటీ విభాగం సంయుక్త కార్యదర్శులుగా పాలకొల్లు నియోజకవర్గం నుంచి పట్టణానికి చెందిన రోణంకి శ్రీనివాసు, ఉండి నియోజకవర్గం నుంచి ఆకివీడుకు చెందిన ఈలపాటి కిషోర్‌బాబును నియమించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం నుంచి ఆదేశాలు అందాయి.

వెలుగు వీవోఏల వేతనాలు పెంచాలి



యానిమేటర్ల నూతన కార్యవర్గం

భీమవరం: వెలుగు వీవోఏలకు వేతనాలు పెంచాలని, పని భారం తగ్గించాలని ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ రాష్ట్రవ్యాప్త ఉద్యమానికి సిద్ధం కావాలని ఏపీ వెలుగు యానిమేటర్ల ఉద్యోగుల సంఘం జిల్లా మహాసభ పిలుపునిచ్చింది. భీమవరం మార్కెట్ యార్డ్‌లో బుధవారం జరిగిన జిల్లా మహాసభలో పలు తీర్మానాల్ని ఆమోదించారు. ఆన్‌లైన్ వర్క్‌తో విపరీతమైన మానసిక ఒత్తిడికి యానిమేటర్లు గురవుతున్నారని, జీతాలు వ్యక్తిగత అకౌంట్లో ప్రతినెల చెల్లించాలని మహాసభ డిమాండ్ చేసింది. జిల్లా కార్యదర్శి ప్రవేశపెట్టిన తీర్మానాలను మహాసభ ఆమోదించింది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా నాగిడి గోవిందమ్మ, ప్రధాన కార్యదర్శిగా ఏ నిర్మలాదేవి, కోశాధికారిగా జి.లక్ష్మి, ఉపాధ్యక్షులుగా ఝాన్సీ, సుబ్బలక్ష్మిని ఎన్నుకున్నారు.

గ్రామీణ నీటి సరఫరా అధికారిగా శ్రీనివాస్

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లా గ్రామీణ నీటి సరఫరా జిల్లా అధికారిగా కె.శ్రీనివాస్ నియమితులయ్యారు. బుధవారం కలెక్టరేట్ చాంబర్‌లో కలెక్టర్‌ను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గ్రామీణ ప్రాంతాలలో ఎలాంటి తాగునీటి సమస్యలు రాకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకుని పనిచేయాలని ఆదేశించారు. ఆయన ఇంజనీర్ ఇన్ చీఫ్ కార్యాలయంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరుగా పనిచేస్తూ పదోన్నతిపై జిల్లాకు వచ్చారు.

స్వచ్ఛంద సంస్థల సేవలు ప్రశంసనీయం



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ జిల్లా కార్యదర్శి కె.రత్నప్రసాద్

ఏలూరు (టూటౌన్): స్వచ్ఛంద సంస్థలు సమాజానికి అందిస్తున్న సేవలు విశేషమైనవని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ అన్నారు. జిల్లా కోర్టు ప్రాంగణంలోని న్యాయ సేవాధికార సంస్థ భవనంలో స్వచ్ఛంద సేవా సంస్థల కార్యకర్తలు, బాలలకు న్యాయ సేవాధికార సంస్థ నిర్వహించే కార్యకలాపాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కె.రత్న ప్రసాద్ మాట్లాడుతూ స్వచ్ఛంద సేవా సంస్థలు సమాజానికి అందిస్తున్న సేవలు విశేషమైనవని న్యాయ సేవాధికార సంస్థ అందించే ఉచిత న్యాయసేవలపై అవగాహన కల్పించడంతో ఎంతో కృషి చేస్తున్నాయన్నారు. డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ సూర్య చక్రవేణి, సీడీపీఓ తులసి, చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్ రావు పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సంతకం ఫోర్జరీ

ఏలూరు (టూటౌన్): ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సంతకాన్ని ఫోర్జరీ చేసి 2019 నుంచి ఇంతవరకు దాదాపు రూ.70 లక్షల మేర నిధులు దుర్వినియోగంపై కలెక్టర్ సీరియస్ అయ్యారు. దీనికి కారకుడైన ఎస్సీ కార్పొరేషన్ జూనియర్ అసిస్టెంట్ పవన్ కుమార్‌ను సస్పెండ్ చేశారు. తాజాగా రూ.6 లక్షలు విత్‌డ్రా చేయడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ఎస్సీ కార్పొరేషన్ నిధులను దుర్వినియోగం చేసినందుకు పవన్ కుమార్‌ను బుధవారం విధుల నుంచి కలెక్టర్ వెట్రిసెల్వి సస్పెండ్ చేశారు. సొమ్ము దుర్వినియోగంపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టేందుకు ఉన్నతాధికారులు సిద్ధమయ్యారు.

మా పొట్ట కొట్టారు!

- ఫ్రీ బస్సుతో ఉపాధి కోల్పోయిన ఆటోవాలాలు
- రోజుకు రెండు, మూడు ట్రిప్పులు కూడా వేయలేని దుస్థితి
- ఫైనాన్స్ బకాయిలపై ఆందోళన
- దిక్కుతోచని స్థితిలో 40 వేల కుటుంబాలు

స్త్రీ శక్తి పేరిట కూటమి ప్రభుత్వం తెచ్చిన ఫ్రీ బస్సు పథకం ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్న వేలాది కుటుంబాలను రోడ్డున పడేసింది. ప్రయాణికులు రాక, రోజు గడవక ఆటోవాలాలు అగచాట్లు పడుతున్నారు. ఒకప్పుడు ఆడుతూ, పాడుతూ సాగిపోయిన వారు ఇప్పుడు బతుకు రూటెటో తెలియని దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు.



20 ఏళ్లకుపైగా కొవ్వూరు, మత్స్యపురి, నరసాపురం రూట్‌లో ఆటో నడుపుతున్నాను. ఇంత దయనీయమైన పరిస్థితి ఎప్పుడూ చూడలేదు. జీవనం కష్టంగా మారింది. నా భార్య గృహిణి కాగా అమ్మాయి నర్సింగ్, అబ్బాయి ఇంటర్ చదువుతున్నారు. ఇది వరకు రోజుకు రూ.1000 వరకూ కిరాయిలు తోలేవాడిని. ఖర్చులు పోను రూ.600 వరకు ఇంటికి తీసుకువెళ్లేవాడిని. ఉచిత బస్సు కారణంగా కిరాయి ఉండటం లేదు. రోజంతా ప్రయాణికుల కోసం స్టాండు వద్ద పడిగాపులు కాయాల్సి వస్తోంది. రూ.200–300 వచ్చినా పెట్రోల్ ఖర్చులకు రాక ఇల్లు గడవడం కష్టమవుతుంది. నెలకు రూ.5 వేలు ఆటో ఫైనాన్స్ చెల్లించేందుకు ఇబ్బంది పడాల్సిన దుస్థితి నెలకొంది

– గంటా విజయ్‌కుమార్, మల్లవరం



సాక్షి, భీమవరం: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 40 వేల ఆటోలు ఉన్నాయి. వీటిలో దాదాపు 90 శాతం ఆటోలు నెలనెలా వాయిదాలు చెల్లించే విధంగా ఫైనాన్స్‌పై తీసుకున్నవే. ప్రస్తుతం ఆటోకు అప్పు రూ.4 లక్షలు వరకు ఉండగా నెలకు రూ.10 వేల నుంచి రూ. 15 వేలు వరకు వాయిదా చెల్లించాలి. మరమ్మతులు, టైర్ల అరుగుదల తదితర రూపాల్లో ఖర్చులు నెలకు రూ. 5 వేల వరకు ఉంటాయి. రోజంతా కష్టపడితే సంపాదన రూ. వెయ్యి నుంచి రూ. 1200 లోపే ఉంటుంది. ఖర్చులు పోను ఇంటికి తెచ్చేది రూ.500 నుంచి రూ. 600 మాత్రమే. ఏదైనా తేడా వస్తే రవాణశాఖ, పోలీసుల జరిమానాల రూపంలో అదనపు భారం భరించాలి. అన్నీ సక్రమంగా ఉంటే అంతంతమాత్రంగా సాగే ఆటో రంగంపై 40 వేల కుటుంబాలు ఆధారపడి ఉన్నాయి. వీరితో పాటు మెకానిక్, సీటు వర్క్, స్పేర్స్ వ్యాపారాల రూపంలో మరో ఐదు వేల కుటుంబాలు ఉపాధి పొందుతున్నాయి.

ఉపాధికి గండి : ఉచిత బస్సు ప్రయాణంతో మహిళలు ఆటోలు ఎక్కడం మానేశారు. ప్రధాన రూట్లతో పాటు పట్టణాల్లో కిలోమీటరు, రెండు కిలోమీటరు దూరాలకు సైతం బస్సులను ఆశ్రయిస్తున్నారు. దీంతో ఆటోలు కదలని పరిస్థితి నెలకొంది. గతంలో రోజుకు రూ.1200 వరకు కిరాయిలు చేస్తే ప్రస్తుతం రూ.200, రూ.300 చేయడం గగనం అవుతోంది. మహిళలకు ఫ్రీ బస్సుతో ఉపాధి కోల్పోయి రోడ్డున పడతామని గత ఆరేడు నెలలుగా మొత్తుకుంటున్నా ప్రభుత్వానికి కనికరం లేకుండా పోయిందని ఆటోవాలాలు వాపోతున్నారు. కనీసం సంప్రదించకుండా, ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలు చూపకుండా ఏకపక్షంగా సర్కార్ తీసుకున్న నిర్ణయాన్ని ఆటో యూనియన్లు తప్పుపడుతున్నాయి. కూటమి ఎన్నికల హామీలో ఆర్టీసీ బస్సుల్లో ఉచిత బస్సు ప్రయాణం హామీ ఇచ్చిన రోజు నుంచి తమకు జరుగుతున్న అన్యాయంపై వివిధ రూపాల్లో ఆందోళన చేస్తున్నా సర్కార్ నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరిస్తోందని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అక్కున చేర్చుకున్న జగన్ సర్కార్

మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆటో కార్మికుల సంక్షేమానికి పెద్దపీట వేశారు. వాహన మిత్ర పథకం ప్రవేశపెట్టి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వేలాది కుటుంబాల ఉపాధికి భరోసానిచ్చారు. ఆటో ఉన్న ప్రతి కార్మికుడికి ఏటా రూ.10 వేలు వాహన మిత్ర పథకం ద్వారా ఆర్థిక సహాయం చేసి ఆదుకున్నారు. కోవిడ్ లాంటి కష్టకాలంలోనూ ఈ పథకం వారికి ఎంతో ఆసరా అయ్యింది. ఎన్నికల సమయంలో రూ.15,000 ఇస్తామంటూ హామీ ఇచ్చిన కూటమి నేతలు ఇప్పుడు ఆ ఊసే ఎత్తకపోవడం గమనార్హం.

ఏం పాలుపోవడం లేదు



ఫ్రీ బస్సు వల్ల ఆటో డ్రైవర్ల జీవితాలు అధ్వానంగా మారాయి. రోజుకు రెండు మూడు ట్రిప్పులు కూడా పడటం లేదు. ఉచిత బస్సు పథకం అమలు చేసే ముందు ఆటో డ్రైవర్లు నష్టపోకుండా ఆదుకుంటామని హామీ ఇచ్చిన కూటమి నేతలు మమ్మల్ని పట్టించుకోకపోవడం దారుణం.

– తిరునగరి రమేష్, ఉండి ఆటో యూనియన్ కార్యదర్శి

కిరాయిలు తగ్గాయి



భీమవరం టౌన్‌లో కిరాయికి ఆటో తోలుతున్నాను. ప్రతిరోజు రూ. వెయ్యి నుంచి 1,500 వరకు సంపాదించేవాడిని. ఇప్పుడు ఆ డబ్బులు రావడం లేదు. నేను నా భార్య ఇద్దరు పిల్లలు బతకాలి. ఫ్రీ బస్సుతో కిరాయిలు తగ్గాయి.

– గండి చిట్టిబాబు, ఆటో డ్రైవర్, కుముదవల్లి

డిగ్రీ చదివి ఆటో నడుపుతున్నాం



డిగ్రీ వరకు చదువుకున్నాను. ఉద్యోగం రాకపోవడంతో స్వయం ఉపాధి పథకం కింద ఆటో కొనుగోలు చేసి స్వీయ ఉపాధి పొందుతున్నాం. నాపై ఆధారపడి కుటుంబం ఉంది. ప్రభుత్వం తీసుకొచ్చిన ఉచిత బస్సు ప్రయాణం మా పొట్ట కొట్టే విధంగా ఉంది.

– ఉప్పాటి రామన్న, జగన్నాథపురం,తాడేపల్లిగూడెం మండలం

భవిష్యత్ అంధకారం



ఉచిత బస్సు ప్రయాణంతో ఆటో కార్మికుల బతుకు అంధకారంగా మారుతుంది. ఆటోపై ఆధారపడి పిల్లలను చదివించుకుంటున్నాం. పిల్లల చదువులు అగమ్యగోచరంగా మారుతుంది. ప్రభుత్వం పునరాలోచన చేయాలి.

– పోలోతు శ్రీనివాస్, జగన్నాథపురం,తాడేపల్లిగూడెం మండలం

మహిళలకు మెరుగైన ఉపాధి కల్పించాలి

భీమవరం (ప్రకాశంచౌక్): స్వయం సహాయక సంఘాల మహిళలకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. కలెక్టరేట్ వశిష్ఠ సమావేశ మందిరం నందు గుర్రపు డెక్క నుంచి వర్మీకంపోస్ట్ తయారీ, ఎస్‌జీహెచ్‌సీ మహిళల ఉపాధి అంశంపై కలెక్టర్ బుధవారం సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గుర్రపు డెక్క నుంచి వర్మి కంపోస్ట్ తయారీ యూనిట్లు ప్రతి మండలంలో తప్పనిసరిగా ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్‌హెచ్‌జీలకు ఉపాధి అవకాశం ఏర్పాటుకు ఇది చక్కని అవకాశం అన్నారు. సమావేశంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి ఎంఎస్ఎస్ వేణుగోపాల్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, డ్వామా పీడీ డా.కెసీహెచ్ అప్పారావు తదితరులు పాల్గొన్నారు. జిల్లాలో పారిశుధ్య నిర్వహణపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ అన్నారు. కలెక్టరేట్ నుంచి బుధవారం వర్క్ ఫ్రం హోం, ఈ కేవైసీ, వాహనాల ఆధార్ సీడింగ్, తల్లికి వందనం, పారిశుద్ధ్య నిర్వహణ తదితర అంశాలపై మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి

భీమవరం: రసాయన రహిత వ్యవసాయ సాగుపై రైతులు దృష్టి సారించేలా ప్రోత్సహించాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. కలెక్టరేట్‌లో వ్యవసాయ, ఉద్యాన, పశు వైద్య, డీఆర్డీఏ శాఖలతో జిల్లా స్థాయి సమావేశం బుధవారం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగించకుండా, జీవసంబంధమైన పదార్థాలను ఉపయోగించి ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నామన్నారు. జిల్లాలో ఇప్పటికే 75 గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు నడుస్తోందన్నారు. ప్రకృతి వ్యవసాయ సాగుపై అవగాహన పెంచేందుకు గ్రామ స్థాయిలో విస్తృతంగా ర్యాలీలు, సమావేశాలు నిర్వహించి రైతులకు అవగాహన కల్పించాలన్నారు.

బిల్లుల పెండింగ్‌పై కాంట్రాక్టర్ల బెంగ



భీమవరంలో ఆందోళన వ్యక్తం చేస్తున్న కాంట్రాక్టర్లు

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం మున్సిపాలిటీకి సంబంధించి గత ప్రభుత్వం ఎన్నికల ముందు దాదాపు 90 శాతం బిల్లులు క్లియర్ చేసింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత చేసిన పనులకు సంబంధించిన బిల్లులు సీఎఫ్ఎంఎస్‌కు పంపగా ఈ ఏడాది మార్చి 31న క్యాన్సిల్ చేశారు. అప్పటి నుంచి కాంట్రాక్టర్లకు పైసా బిల్లు అందలేదు. పలుమార్లు ఉన్నతాధికారులు, మున్సిపల్ మంత్రి నారాయణ దృష్టికి తీసుకువెళ్లినా ప్రయోజనం లేకుండా పోయింది. బుధవారం భీమవరంలో మున్సిపల్ కాంట్రాక్టర్లు మాట్లాడుతూ బిల్లులు అందక పడుతున్న ఇబ్బంది పడుతున్నామన్నారు. మార్చి 31న సీఎఫ్ఎంఎస్‌లో ఉన్న బిల్లుల్ని క్యాన్సిల్ చేశారని, నిధి పోర్టల్ తీసుకొచ్చి బిల్లులు అప్‌లోడ్ చేసుకోమన్నారు. ఏప్రిల్ 19 వరకూ బిల్లులు అప్‌లోడ్ చేశామని, ఆగస్టు 21 వరకూ భీమవరం మున్సిపాలిటీకి సంబంధించి సుమారు రూ.9 కోట్ల మేర 60 బిల్లులు అప్‌లోడ్ చేశామన్నారు. ఆ తర్వాత గ్రీన్ చానల్లో బిల్లులు అప్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. కొత్తగా ప్రతి నెలా 11 నుంచి 20 మధ్య బిల్లులు పెట్టుకోవాలని కమిషనర్లకు చెప్పారన్నారు. ఈనెల 4 నుంచి కొత్తగా అప్‌లోడ్ చేసిన బిల్లులకు పేమెంట్లు చేశారు. గత 15 నెలలుగా పెండింగ్ ఉన్న బిల్లులకు సంబంధించి ఎలాంటి పేమెంట్లు చేయకపోగా 4న అప్‌లోడ్ చేసిన బిల్లులు ఇవ్వడంతో వారు వాపోతున్నారు. ఒక్కొక్కరికి రూ.40 లక్షల నుంచి రూ.3 కోట్ల వరకూ బిల్లులు బకాయిలు ఉన్నాయన్నారు.

డిజిటల్ అరెస్ట్ పేరుతో రూ.99 లక్షలకు టోకరా

భీమవరం: డిజిటల్ అరెస్ట్ పేరుతో వృద్ధులను భయభ్రాంతులకు గురిచేసి సైబర్ నేరస్తులు రూ.99 లక్షలకు టోకరా వేశారు. వివరాల ప్రకారం భీమవరం వెంకయ్యనాయుడు వీధికి చెందిన వృద్ధుల కుమారులిద్దరూ అమెరికాలో ఉంటూ తల్లిదండ్రులకు అవసరాల నిమిత్తం నగదును ఖాతాల్లో ప్రతినెలా జమచేస్తున్నారు. బాధితులకు చెందిన 5 బ్యాంకు ఖాతాల్లో మొత్తం కోటి రూపాయలున్నాయి. ఈ ఏడాది ఏప్రిల్ 22న ఫిర్యాదుదారు భర్తకు గుర్తు తెలియని వ్యక్తి నుంచి ఫోన్‌కాల్ వచ్చింది. కెనరా బ్యాంకు, ఢిల్లీ నుంచి అని చెప్పారు. కుమారుల క్రెడిట్ కార్డు బిల్ జమచేయకపోవడంతో మనీ లాండరింగ్ చట్టం కింద అరెస్టు వారెంట్ జారీ చేస్తామన్నారు. వీడియోకాల్‌లో వృద్ధులను భయపెట్టారు. బ్యాంకు ఖాతాల వివరాలు పంపించమని చెప్పారు. డిజిటల్ అరెస్టులో ఉన్నారని చెప్పి రూ.99 లక్షలను ఆరు భాగాలుగా వివిధ ఖాతాలకు తరలించాలని డిమాండ్ చేశారు. ఇంకా రూ.60 లక్షలు డిమాండ్ చేశారు. భయభ్రాంతులకు గురైన వృద్ధులు ఇళ్లు అమ్మి ఇవ్వాలనుకున్నారు. ఈ విషయాన్ని కుమారుడి దృష్టికి తీసుకెళ్లగా భీమవరం ఒకటో పట్టణ పోలీసులకు ఈ నెల 8న ఫిర్యాదు చేశారు. ఎస్సై కె.మోహన వంశీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అంతర్జాతీయ పారా అథ్లెటిక్స్‌కు ఎంపిక

ద్వారకాతిరుమల: పంగిడిగూడెంకు చెందిన కస్సే పవన్‌కుమార్ అంతర్జాతీయ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌నకు ఎంపికయ్యాడు. నెల వ్యవధిలోనే రాష్ట్ర, జాతీయ స్థాయిలో 6 పతకాలను సాధించి అందరి చూపు తన వైపు తిప్పుకున్నాడు. గత నెల 9న విశాఖలో జరిగిన రాష్ట్రస్థాయిలో పోటీల్లో 3 స్వర్ణ పతకాలను సాధించాడు. ఆగస్టు 29 నుంచి 31 వరకు మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో జరిగిన జాతీయ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో స్వర్ణ, రెండు రజత పతకాలు సాధించి అంతర్జాతీయ చాంపియన్‌షిప్‌నకు ఎంపికయ్యాడు. డిసెంబర్ 7 నుంచి దుబాయ్‌లో జరిగే పోటీల్లో పాల్గొంటాడు.

కిడ్నీ రాకెట్‌లో పోలవరం తహసీల్దార్!

- కిడ్నీ రోగికి అక్రమంగా ఫ్యామిలీ సర్టిఫికెట్ జారీ
- బాధితురాలి ఫిర్యాదుతో వెలుగులోకి వాస్తవాలు

సాక్షి, అమరావతి: తప్పుడు ఫ్యామిలీ సర్టిఫికెట్ జారీ చేయడం ద్వారా ఓ తహసీల్దార్ కిడ్నీ రాకెట్‌కు సహకరించినట్లు తేలింది. సరైన విచారణ లేకుండా సర్టిఫికెట్ జారీ చేసినట్లు నిర్ధారణ కావడంతో సంబంధిత వ్యవహారంపై పోలీసు కేసు నమోదైంది. దీనిపై అన్ని ఆధారాలతో భూ పరిపాలన ప్రధాన కమిషనర్ కార్యాలయానికి ఫిర్యాదులు అందినా ఆయనపై ఎలాంటి చర్య తీసుకోకుండా వదిలేశారు. ప్రస్తుతం ఏలూరు జిల్లా పోలవరం తహసీల్దార్‌గా పని చేస్తున్న బీఎస్‌వీఎస్ఆర్ఎల్ రాజు గతంలో నిడమర్రు తహసీల్దార్‌గా పని చేశారు. ఆ సమయంలో నిడమర్రుకు చెందిన యర్రంశెట్టి ఉదయ కిరణ్(కిడ్నీ సమస్యతో బాధపడుతున్న వ్యక్తి) ఏలూరులో కూరగాయలు అమ్ముకుని జీవించే బూసి అనూరాధకు రూ.ఏడు లక్షలు ఇస్తామని ఆశ చూపి కిడ్నీ ఇవ్వాలని కోరాడు. దీనికి అనూరాధ అంగీకరించడంతో ఉదయ్ అక్రమ మార్గంలో బూసి అనూరాధ ఇంటి పేరును మార్చి తన భార్యగా పేర్కొంటూ ఫ్యామిలీ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేశాడు. బూసి అనూరాధ ఆధార్ కార్డులో ఇంటి పేరును యర్రంశెట్టిగా మార్చాడు. దీంతో తహసీల్దార్ ఆధార్ కార్డు చూసి ఆమె ఉదయ్ భార్యేనని నిర్ధారించి ఫ్యామిలీ సర్టిఫికెట్ జారీ చేసేశారు. నిబంధనల ప్రకారం నిడమర్రులో విచారణ నిర్వహించి సర్టిఫికెట్ జారీ చేయాలి. డబ్బులు తీసుకుని విచారణ లేకుండా ఫ్యామిలీ సర్టిఫికెట్ జారీ చేసినట్టు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆ సర్టిఫికెట్ ఉపయోగించుకుని ఉదయ్ కిరణ్ తన భార్య అనూరాధ తనకు కిడ్నీ ఇస్తున్నట్లు చూపించి కిడ్నీ మార్పిడి చేయించుకున్నాడు.

రూ.ఐదు లక్షలే ఇచ్చారు

పేదరికంలో ఉన్న అనూరాధ రూ.ఏడు లక్షలు ఇస్తామంటే ఆశపడి కిడ్నీ ఇచ్చేందుకు అంగీకరించింది. అయితే మధ్యవర్తి ప్రసాద్ ఆమెకు రూ.ఐదు లక్షలే ఇవ్వడం, కిడ్నీ మార్పిడి తర్వాత ఆమె అనారోగ్యం పాలైనా చికిత్స చేయించకపోవడంతో విషయం బయటపడింది. తనను మోసం చేసి కిడ్నీ తీసుకున్నారని, తనకు ఇస్తానన్న డబ్బులు ఇవ్వలేదని, ఆధార్ కార్డులో తనకు తెలియకుండా ఉదయ్ భార్యగా మార్పు చేశారని అనూరాధ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై ఏలూరు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదైంది. ఈ అక్రమం జరగడానికి ట్రాన్స్‌ప్లాంటేషన్ ఆఫ్ హ్యూమన్ ఆర్గాన్ చట్టం, 1994 మార్గదర్శకాల ప్రకారం సరైన పరిశీలన, విచారణ లేకుండా డబ్బుల కోసం తహసీల్దార్ ఫ్యామిలీ సర్టిఫికెట్ జారీ చేయడమేనని స్పష్టమైంది. పోలీసు విచారణలోనూ తహసీల్దార్ తప్పు చేసినట్లు తేలింది. ఉన్నతాధికారులను మేనేజ్ చేయడం ద్వారా తహసీల్దార్ తనపై వచ్చిన ఫిర్యాదులన్నింటినీ బుట్టదాఖలు చేయించారనే ఆరోపణలున్నాయి. భూ పరిపాలన ప్రధాన కమిషనర్ కార్యాలయానికి ఫిర్యాదులు వెళ్లినా దీనిపై కనీస విచారణ జరపలేదు. అధికార పార్టీల ఎమ్మెల్యేలు, నేతలు, ప్రభుత్వం చెప్పిన కేసులకు సంబంధించి మాత్రమే సీసీఎల్ఏలో ఆగమేఘాలపై విచారణ చేసి చర్యలు తీసుకుంటున్నారు. మిగిలిన ఎటువంటి ఫిర్యాదులైనా అటకెక్కుతున్నాయి.

సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

భీమవరం (ప్రకాశంచౌక్): గ్రామ/వార్డు సచివాలయాల ఉద్యోగుల సమస్యలను 15 రోజుల్లో పరిష్కరించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడతామని సచివాలయ ఉద్యోగుల ఐక్యవేదిక స్పష్టం చేసింది. ఈ మేరకు జిల్లా ఐక్యవేదిక సభ్యులు జీఎస్‌డబ్ల్యూఎస్ అధికారి వై.దోసిరెడ్డికి నోటీసు అందజేశారు. ఇంటింటికీ తిరుగుతూ చేసే సర్వేల నుంచి విముక్తి కల్పించాలన్నారు. గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగులను వారి సంబంధిత మాతృశాఖలకే అనుసంధానం చేయాలని, సమయ పాలన లేకుండా ఆదివారాలు, పండుగలు, సెలవుల్లో కూడా విధులు చేయించడం నిలిపివేయాలని కోరారు. నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని, ఒకే కేడర్‌లో కొనసాగుతున్న ఉద్యోగులకు స్పెషల్ ఇంక్రిమెంట్ ఇవ్వాలని కోరారు. పారదర్శక బదిలీలు జరిగేలా ప్రత్యేక విధి విధానాలు రూపొందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ ప్రతినిధులు షేక్ ఉమర్ అలీషా, ఎం.వెంకటేష్, డి.స్వర్ణలత, కే ఆదిత్య, కే కళ్యాణి, టి.చాందిని తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న సచివాలయ ఉద్యోగులు

క్లుప్తంగా

కేవీకే హెడ్ సైంటిస్ట్‌కు అవార్డు


మల్లికార్జునరావు (ఫైల్)

ఉండి: ఏరువాక ఉత్తమ శాస్త్రవేత్త అవార్డుకు ఎన్నార్పీ అగ్రహారం కృషీ విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.మల్లిఖార్జున రావు ఎంపికయ్యారు. ఏరువాక ఫౌండేషన్ ఏటా వ్యవసాయ అనుబంధ రంగాల్లోని వివిధ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచే శాస్త్రవేత్తలను ఎంపిక చేసి అవార్డులు అందజేస్తుంది. దీనిలో భాగంగా 2023-24కి గాను ఉత్తమ విస్తరణ నిపుణుడు ఎంటొమోలోజీ విభాగంలో డాక్టర్ మల్లిఖార్జునను ఉత్తమ శాస్త్రవేత్తగా ఎంపిక చేశారు. ఈమేరకు ఫౌండేషన్ నుంచి తనకు సమాచారం అందినట్లు మల్లిఖార్జునరావు తెలిపారు. ఈ నెల 26, 27 తేదీల్లో గుంటూరు కేఎల్ యూనివర్సిటీలోని కాలేజ్ ఆఫ్ అగ్రికల్చర్ ఆర్అండ్‌డీ థియేటర్‌లో నిర్వహించే ప్రత్యేక కార్యక్రమంలో ఈ అవార్డు అందజేస్తారని ఆయన చెప్పారు.

ఎరువుల దుకాణంపై కేసు


బొర్రంపాలెంలో ఎరువుల నిల్వలను పరిశీలిస్తున్న అధికారులు

టి.నరసాపురం: బొర్రంపాలెం అన్నపూర్ణ ఫెర్టిలైజర్స్ అండ్ జనరల్ స్టోర్స్‌లో బుధవారం విజిలెన్స్ అధికారుల బృందం తనిఖీలు నిర్వహించారు. షాపులో ఆయా ఎరువులు ఉండాల్సిన దానికన్నా 3.245 టన్నులు తక్కువగా ఉన్నట్లు గుర్తించారు. రూ.6,98,663 విలువ కలిగిన యూరియా, పొటాష్, 10-26, సూపర్ 39.585 టన్నులను సీజ్ చేశారు. షాప్ యజమాని అశోక్ కుమార్‌పై 6 ఏ కేసు నమోదు చేశారు. దాడుల్లో విజిలెన్స్ ఎస్సై రంజిత్ కుమార్, విజిలెన్స్ ఏవో మీరయ్య, మండల వ్యవసాయ అధికారిణి బి.ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

17 నుంచి మిద్దెతోటల పెంపకంపై శిక్షణ

ఉండి: ఈ నెల 17వ తేదీ నుంచి ఎన్నార్పీ అగ్రహారంలోని కృషీ విజ్ఞాన కేంద్రంలో మిద్దెతోటల పెంపకంపై శిక్షణ, అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్ మల్లిఖార్జునరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మిద్దెతోటల పెంపకంతో పాటు తేనెటీగలు, కోళ్లు, చేపల పెంపకం, బయోడీకంపోజర్స్ వినియోగం తయారీపై సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించడంపై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి మిద్దెతోటల పెంపకం నిపుణుడు వేణుగోపాలరావు తదితర జిల్లా మండల అధికారులు హాజరువుతారని తెలిపారు. మిద్దెతోటలు తదితర వాటిపై అవగాహన, శిక్షణలో ఆసక్తి గల మహిళలు హాజరు కావాలని కోరారు.

జిల్లా జట్ల ఎంపిక

పెదవేగి : ఎస్‌జీఎఫ్ అండర్ 19 జిల్లా జట్ల ఎంపిక పోటీలు బుధవారం పెదవేగి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకులంలో ఉత్సాహంగా జరిగాయి. ఫెన్సింగ్ జూడో, బాక్సింగ్, బీచ్ వాలీబాల్, రగ్బీ, తైక్వాండో, గక్కా క్రీడాంశాలలో పోటీలు నిర్వహించి జిల్లా జట్లను ఎంపిక చేసినట్లు డీవైఈఓ టి శేఖర్‌బాబు, ఆర్గనైజింగ్ కార్యదర్శి కె జయరాజు తెలిపారు. ఈ పోటీల్లో కళాశాల ప్రిన్సిపాల్ ఏవీ శివప్రసాద్, ఇతర పీడీలు పాల్గొన్నారు.

మెకానిక్ ఆత్మహత్య

భీమవరం: భీమవరం ఒకటో పట్టణంలోని శ్రీనివాసా కూడలిలో ఇంట్లో ఉరివేసుకుని సునీల్ (39) అనే వ్యక్తి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. సునీల్ పట్టణంలోని ఓ దుకాణంలో మోటార్‌సైకిల్ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం రాత్రి ఆత్మహత్య సమాచారం అందడంతో ఎస్సై బీవై కిరణ్‌కుమార్ సంఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు.



భావ ప్రకటన స్వేచ్ఛను అణగదొక్కుతారా?



దేశంలో ఫోర్త్ ఎస్టేట్‌గా ఉన్న జర్నలిస్టుల భావ ప్రకటన స్వేచ్ఛను అణగదొక్కటం, భయభ్రాంతులకు గురి చేయటం సరైంది కాదు. ప్రజాస్వామ్యంలో ఎవరూ అడ్డు ఉండకూడదు, విమర్శించకూడదు అనే భావన నిరంకుశత్వానికి నిదర్శనం. జర్నలిస్టుల హక్కులను కాలరాయటం అభ్యంతరకరం. చట్టసంస్థలు స్పందించాలి, శాశ్వత పరిష్కారం చూపాలి. పత్రికా రంగ హక్కులను, విలువలను పరిరక్షించాలి.

– ముదుగురు సూర్యనారాయణ, రిటైర్డ్ లెక్చరర్, కొత్తూరు, పెదపాడు మండలం

పత్రికా స్వేచ్ఛకు తీవ్ర భంగం



పత్రికలు ప్రజల గొంతుకుగా సమాజంలో అన్యాయాలపై ప్రశ్నిస్తాయి. రాష్ట్రంలో పత్రికా స్వేచ్ఛకు తీవ్ర భంగం కలుగుతోంది. మీడియాలో ఎడిటర్ స్థాయి వ్యక్తులపై కేసులు నమోదు చేయడం అన్యాయం. సాక్షి ఎలక్ట్రానిక్ మీడియాలో కెమెరామెన్‌ల మీద కూడా పోలీసులు కేసులు నమోదుకు ఉపక్రమిస్తున్నారు. సమాజంలో ప్రతిఒక్కరూ ఇటువంటి ఘటనలను ఖండించాలి.

– బీవీ రావు, వైఎస్సార్‌సీపీ మేధావుల ఫోరం, రాష్ట్ర కార్యదర్శి, కైకలూరు

పశువుల్లో 'లంపీ'తో అప్రమత్తం

- శ్రీవారి క్షేత్రంలో తాత్కాలికంగా గోదానం, గోదత్తత నిలుపుదల
- గోసంరక్షణ శాలలో పశువులకు టీకాలు

ద్వారకాతిరుమల : పశువులకు ముద్దచర్మ (లంపీ స్కిన్) వ్యాధి వ్యాపిస్తుండటంతో శ్రీవారి దేవస్థానం అధికారులు అప్రమత్తమయ్యారు. వెంటనే గోదానం, గోదత్తత పథకాలను తాత్కాలికంగా నిలుపుదల చేశారు. ప్రస్తుతం గోసంరక్షణశాలలో మొత్తం 326 పశువులు ఉన్నాయి. పశువైద్యాధికారులు ఇప్పటికే వాటన్నిటికి లంపీ స్కిన్ వ్యాధి నివారణా టీకాలు వేశారు. అయితే ఇటీవల ఓ భక్తుడు ఆవు, దూడను దానంగా ఇవ్వగా అందులో దూడకు లంపీ స్కిన్ వ్యాధి ఉన్నట్టు గుర్తించిన వైద్యులు, దానికి చికిత్స అందించారు. ప్రస్తుతం ఆ దూడ కోలుకుంది. ఇలాంటి పరిస్థితుల్లో గోదానాన్ని స్వీకరిస్తే గోసంరక్షణశాలలోని అన్ని గోవులకు ఆ వ్యాధి సోకే ప్రమాదం ఉందని పశువైద్యులు దేవస్థానం అధికారులకు సూచించారు. దాంతో గోదానం, గోదత్తతను ఈనెల 6 నుంచి తాత్కాలికంగా నిలిపివేశారు.

ప్రతిష్టాత్మకంగా గోసంరక్షణ

గోదానం ఎంతో విశిష్టమైనదిగా ధర్మశాస్త్రాలు చెబుతున్నాయి. అందుకే భక్తులు శ్రీవారికి గోవులను దానంగా ఇస్తుంటారు. వాటిలో కొన్నింటిని దేవస్థానం రైతులకు వ్యవసాయ పనుల నిమిత్తం దత్తత ఇస్తోంది. ముందుగా దరఖాస్తు చేసుకున్న రైతులకు ప్రతినెలా రెండవ, నాల్గవ శనివారాల్లో ఆవులను దత్తత ఇస్తున్నారు. ఏడాదిలో ఒకసారి దేవస్థానం అధికారులు రైతుల వద్దకు వెళ్లి వారిచ్చిన గోవులను పరిశీలిస్తున్నారు. అలాగే గోసంరక్షణశాలలో ఉన్న గోవుల పోషణపట్ల అధికారులు, సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు.



గోసంరక్షణశాలలోని షెడ్డులో ఉన్న ఆవులు , గోసంరక్షణశాలలో లంపీ స్కిన్ వ్యాధి నుంచి కోలుకున్న ఆవుదూడ

తెల్ల పశువుల్లోనే వ్యాధి తీవ్రత

తెల్ల పశువులు అయిన ఆవులు, ఎద్దుల్లోనే ఎక్కువగా ఈ వ్యాధి తీవ్రత కనిపిస్తుంది. లంపీ స్కిన్ అనే వైరస్ వల్ల కలిగే ఈ వ్యాధి పశువుల రక్తం పీల్చే దోమలు, ఈగలు, పిడుదుల ద్వారా ఒక పశువు నుంచి మరో పశువుకు సులభంగా వ్యాపిస్తుంది. అది కూడా అక్టోబర్ నుంచి జనవరి మధ్యలోనే ఈ వ్యాధి వ్యాప్తి చెందే అవకాశాలు ఉన్నాయి. అందుకే పశువైద్యాధికారులు, సిబ్బంది గోసంరక్షణ శాలలోని గోవులకు సెప్టెంబర్‌లోనే టీకాలు వేశారు.

జాగ్రత్తలు తప్పనిసరి

పశువులకు లంపీ స్కిన్ వ్యాధి సోకకుండా ముందుగానే టీకాలు వేయించాలి. 104 నుంచి 106 డిగ్రీల జ్వరం వచ్చి, చర్మంపై బొబ్బలు, బుడిపెలు, పొక్కులు ఏర్పడి, నెమ్మదిగా అవి పగిలి పుండ్లుగా మారి, మేత సరిగ్గా తినకపోవడం, నోరు, ముక్కు నుంచి చొంగ కారడం, పాల దిగుబడి తగ్గడం, అలసటగా ఉండటం వంటి లక్షణాలు ఉంటే దాన్ని లంపీ స్కిన్ వ్యాధిగా గుర్తించాలి. వాటిని మంద నుంచి వేరు చేసి, చికిత్స అందించాలి. దోమ తెరలు, లేదా వేపాకు పొగ వేయాలి. గంజి వంటి ఆహార పదార్థాల్లో కాస్త ఉప్పు కలిపి తాగించాలి. జ్వరం తగ్గే వరకు ఓఆర్ఎస్ ద్రావణాన్ని ఇవ్వాలి. జ్వరం తగ్గడానికి మెలోక్సికామ్, అనాల్జిన్ మందులను వైద్యుల సూచనల మేరకు వాడాలి. సెకండరీ బ్యాక్టీరియల్ ఇన్‌ఫెక్షన్ ఉంటే యాంటీ బయాటిక్, న్యూమోనియా లక్షణాలు ఉంటే అవిల్, సీపీఎం వంటి మందులు వాడాలని పశువైద్యులు తెలిపారు. వ్యాధి పూర్తిగా తగ్గిన ఆవులనే దానంగా ఇవ్వాలి.

నెల క్రితమే టీకాలు వేశాం



శ్రీవారి గోసంరక్షణశాల లోని ఆవులకు, గిత్తలకు, దూడలకు నెల క్రితమే లంపీ స్కిన్ వ్యాధి నివారణా టీకాలు వేశాం. బయట నుంచి కొత్తగా పశువులు లోపలికి వస్తే ప్రస్తుతం ఉన్న ఆవులకు వ్యాధి సోకే ప్రమాదం ఉంది. అందుకే కొత్త వాటిని రాకుండా చూడాలని ఆలయ అధికారులకు సూచించాం. వారు వెంటనే అప్రమత్తమై గోదానం, గోదత్తతను నిలిపివేశారు.

– అంగర సురేష్, పశువైద్యాధికారి, ద్వారకాతిరుమల

వ్యాధి తీవ్రత తగ్గిన తరువాతే



లంపీ స్కిన్ వ్యాధి విస్తరిస్తున్న నేపథ్యంలో పశువైద్యాధికారుల సూచనల మేరకు భక్తుల నుంచి గోవులను దానంగా తీసుకోవడం, అలాగే రైతులకు గోవులను దత్తత ఇవ్వడాన్ని తాత్కాలికంగా నిలుపుదల చేశాం. వ్యాధి తీవ్రత తగ్గిన తరువాత మళ్లీ వాటిని పునఃప్రారంభిస్తాం. ఆ సమాచారాన్ని ముందుగా మీడియా ద్వారా అందరికీ తెలియజేస్తాం.

– ఎస్‌వీఎస్ఎన్ మూర్తి, శ్రీవారి దేవస్థానం ఈఓ

15న కృష్ణాష్టమి వేడుకలు


గోసంరక్షణశాల వద్ద కొలువైన శ్రీకృష్ణుడు

ద్వారకాతిరుమల: శ్రీవారి దివ్య క్షేత్రంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఈనెల 15 న అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్టు ఆలయ ఈఓ ఎస్‌వీఎస్ఎన్ మూర్తి తెలిపారు. అందులో భాగంగా ఆరోజు ఆలయంలో స్వామివారికి నిత్యార్జిత కల్యాణాలు, ఆర్జిత సేవలను రద్దు చేస్తున్నట్టు చెప్పారు. అలాగే 16న సాయంత్రం క్షేత్రంలో ఉట్ల పండుగ, శ్రీవారి గ్రామోత్సవాన్ని నిర్వహిస్తామన్నారు. భక్తులు గమనించాలని ఆయన కోరారు.

ఎస్ఎంఆర్ కార్మికులకు వేతనాల పెంపు

ఏలూరు(మెట్రో): జిల్లాలో ఎస్ఎంఆర్ కార్మికులకు 2025 -26 సంవత్సరానికి వేతనాల పెంపును ఖరారు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధ్యక్షతన జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో ఈమేరకు నిర్ణయం తీసుకున్నట్లు ఉప కార్మిక కమిషనర్ పి.శ్రీనివాస్ బుధవారం తెలిపారు. ఒక రోజుకి స్కిల్డ్ కార్మికునికి రూ.710 నుంచి రూ.730, సెమీ స్కిల్డ్ కార్మికునికి రూ.640 నుంచి రూ.665, అన్‌స్కిల్డ్ కార్మికునికి రూ.595 నుంచి రూ.615గా నిర్ణయించారని, ఈ వేతనాలు ఏప్రిల్ 01, 2025 నుంచి అమలులోకి వస్తాయన్నారు.

ఆధిపత్యం కోసమే హత్య

వ్యక్తి దారుణ హత్యలో ఆరుగురు నిందితుల అరెస్ట్

ఏలూరు టౌన్: ఏలూరు రూరల్ కొమడవోలు ఇందిరమ్మ కాలనీలో ఇటీవల జరిగిన దారుణ హత్య కేసులో ఆరుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ బుధవారం ఏలూరు పోలీస్ సబ్ డివిజన్ కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. కొమడవోలు ఇందిరమ్మ కాలనీకి చెందిన పూనూరు రాజేష్ కొందరు రాజకీయ నేతల అండతో గొడవలకు సెటిల్‌మెంట్లు చేస్తూ ఉంటాడు. ఇదే ప్రాంతానికి చెందిన బూరగ నాని అలియాస్ చిన్న నాని మృతుడితో సన్నిహితంగా మెలిగేవాడు. కానీ కొన్ని సందర్భాల్లో రాజేష్ కఠినంగా ప్రవర్తిస్తూ చిన్న నానిని మందలించటం... కొట్టటం చేసేవాడు. రాజేష్‌కు తెలిసిన ఒక మహిళతో నాని చనువుగా ఉండటాన్ని గమనించిన ఆమె బంధువులు గతంలో నానితో గొడవపడి కొట్టారు. దీనిలోనూ రాజేష్ కీలకపాత్ర పోషించాడని నాని మనసులో కక్ష పెంచుకున్నాడు. పైగా ఇందిరమ్మ కాలనీలో సెటిల్‌మెంట్లు చేస్తున్న రాజేష్ లేకుంటే... తానే పెద్దమనిషిగా చలామణి అవ్వచ్చు అనే ఆలోచనతో రాజేష్‌ను చంపేందుకు తన స్నేహితులతో కలిసి పక్కా స్కెచ్ వేశాడు.

కత్తులతో దాడి చేసి..

ముందుగా వేసుకున్న పథకం ప్రకారం ఆగస్టు 31 తేదీ ఆదివారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో ఇందిరమ్మ కాలనీలో రాజేష్ తన ఇంట్లో ఉండగా బూరగ నాని అతని ఇంటికి వెళ్లి బయటకు రావాలని పిలిచాడు. చర్చి సమీపంలోకి తీసుకువెళ్లి నాని, మరో ఐదుగురు కత్తులతో దాడి చేసి కారులో పరారయ్యారు.



నిందితులను అరెస్ట్ చేసి వివరాలు వెల్లడిస్తున్న ఏలూరు డీఎస్పీ శ్రావణ్‌కుమార్

ఈలోగా అరుపులు, కేకలకు రాజేష్ కుమార్తె, కుమారుడు, చెల్లి బయటకు వచ్చి చూడగా తీవ్ర గాయాలతో ఉన్నాడు. కుటుంబ సభ్యులు అతడ్ని ఏలూరు జీజీహెచ్‌కు తరలించగా వైద్యులు పరీక్షించి మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతుడి భార్య ఫిర్యాదుపై ఏలూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

కేసును ఛేదించిన పోలీసులు

ఈ కేసు విచారణకు సంబంధించి ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ ఆదేశాలతో ఏలూరు డీఎస్పీ శ్రావణ్‌కుమార్ పర్యవేక్షణలో ఏలూరు వన్ టౌన్ సీఐ జీ.సత్యనారాయణ, ఏలూరు టూటౌన్ సీఐ కే.అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీస్ బృందాలను ఏర్పాటు చేశారు. నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈనెల 10న ఏలూరు జాతీయ రహదారిపై రత్నాస్ రెస్టారెంట్ వెనుక నిందితులు ఉన్నారనే సమాచారంతో ఏలూరు వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ, రూరల్ ఇన్‌చార్జి ఎస్సై నాగబాబు, సిబ్బంది కలిసి ఆరుగురు నిందితులను పట్టుకున్నారు. వారి నుంచి స్కూటీ, కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

నిందితులు వీరే..

ఏలూరు రూరల్ ఇందిరమ్మ కాలనీకి చెందిన ప్రధాన నిందితుడు బూరగనాని అలియాస్ చిన్ననానితోపాటు, ఏలూరులోని వివిధ ప్రాంతాలకు చెందిన సామంతుల అజయ్‌సూర్య అలియాస్ బెస్సీ, లంకపల్లి బాలకృష్ణ అలియాస్ బాలు, సిగిరెడ్డి సుధాకర్ అలియాస్ సుధా, ఉగ్గిన షణ్ముక వేణుగోపాల్ అలియాస్ వేణు, కటారి పూర్ణచంద్ర శేఖర్ అనే ఆరుగురు వ్యక్తులను అరెస్ట్ చేశారు. వీరిలో ముగ్గురిపై ఏలూరు నగరంలో పాత కేసులు ఉన్నాయి. ఈ కేసును ఛేదించిన సీఐలు సత్యనారాయణ, అశోక్‌కుమార్, ఎస్సై నాగబాబు, ఏఎస్సై సురేష్, హెచ్‌సీ సత్యారావు, కానిస్టేబుళ్లు బీ.నాగార్జున, ఆర్.మోహన్, పీ.నాగరాజు, ఎండీ రుహుల్లా, ఎన్.శేషుకుమార్‌ను ఏలూరు డీఎస్పీ శ్రావణ్‌కుమార్ ప్రత్యేకంగా అభినందించారు.

క్వాంటం వ్యాలీ హేకథాన్ పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

భీమవరం: ఉభయగోదావరి జిల్లాలకు సంబంధించి భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన అమరావతి క్వాంటం వ్యాలీ హేకథాన్ 2025 సెమీఫైనల్స్‌లో విజేతలకు కలెక్టర్ చదలవాడ నాగరాణి చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. విన్నర్స్‌గా భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కాలేజీ, శ్రీ విష్ణు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ భీమవరం, బీవీసీ ఇంజనీరింగ్ కాలేజ్, రాజమండ్రి, గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ రాజమండ్రి, ఆదిత్య కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ సూరంపాలెం, ప్రగతి ఇంజనీరింగ్ కాలేజీ సూరంపాలెం, ఆదిత్య డిగ్రీ అండ్ పీజీ కాలేజీ ఫర్ ఉమెన్ రాజమండ్రి, ఆదిత్య డిగ్రీ అండ్ పీజీ కాలేజీ కాకినాడ వారికి దక్కగా, ఒక్కొక్క టీంకి రూ.10 వేల చెక్కును కలెక్టర్ చదలవాడ నాగరాణి చేతుల మీదుగా అందించారు. రన్నర్స్‌గా నిలిచిన కళాశాలలకు ఒక్కొక్క టీంకు రూ.5 వేల చొప్పున అందించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ మురళీకృష్ణంరాజు అధ్యక్షతన జరిగిన ఈ పోటీలకు ఉన్నత విద్యా మండల్ నుంచి ప్రత్యేక పరిశీలకులు డాక్టర్ పి అనిల్‌కుమార్ హాజరుకాగా రీజినల్ సెంటర్ కోఆర్డినేటర్ డాక్టర్ పి రవికిరణ్ వర్మ, కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిషాంత వర్మ, ఉపాధ్యక్షుడు ఎస్వీ రంగరాజు, డైరెక్టర్ డాక్టర్ ఎం జగపతి రాజు, ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ మురళీకృష్ణంరాజు, చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సీహెచ్ దిలీప్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

మన్యంలో ప్రకృతి సేద్యం

- 10 వేల ఎకరాల్లో రసాయన రహిత సాగు
- స్వయంగా కషాయాలు తయారు చేస్తున్న గిరిజన రైతులు


ముద్దప్పగూడెంలో కషాయాలు తయారుచేస్తున్న గిరిజన రైతులు

బుట్టాయగూడెం: రసాయన ఎరువులు, పురుగు మందుల వినియోగంతో వ్యవసాయం భారంగా మారుతోంది. మిత్ర పురుగుల నాశనంతో చీడపీడల బెడద పెరుగుతుంది. దీనితో అధికారుల ప్రోత్సాహంతో తక్కువ పెట్టుబడి కలిగిన ప్రకృతి వ్యవసాయంపై గిరిజన రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. మన్యంలో ప్రకృతి వ్యవసాయంపై గిరిజన రైతులకు ఐటీడీఏ, ప్రకృతి వ్యవసాయ రైతులు అవగాహన కలిగిస్తున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సుమారు 1,596 మందికి పైగా సుమారు 10 వేల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేపట్టినట్లు అధికారులు చెబుతున్నారు.

ప్రకృతి సాగులో పంటలు

కేఆర్‌పురం ఐటీడీఏ పరిధిలోని బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, పోలవరం మండలాలతోపాటు జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం మండలాల్లో గిరిజనులు సుమారు 10 వేల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేపట్టారు. వరి, మొక్కజొన్న, వేరుశనగ, మినుము పంటలతోపాటు జీడిమామిడి, అన్ని రకాల ఆకుకూరలు, కూరగాయల పంటలను ప్రకృతి వ్యవసాయంగా సాగు చేసి పండిస్తున్నారు. వీటిలో బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, పోలవరం మండలాల పరిధిలో 4 వేల ఎకరాల్లో జీడిమామిడి, 2 వేల ఎకరాల్లో మొక్కజొన్న, 270 ఎకరాల్లో వరి, 200 ఎకరాల్లో మిర్చి, 250 ఎకరాల్లో మినుము, 280 ఎకరాల్లో కూరగాయలు, 3 వేల ఎకరాల్లో చిరుధాన్యాల పంటలు సాగు చేస్తున్నట్లు అధికారులు చెప్పారు.

స్వయంగా కషాయాల తయారీ

ప్రకృతి వ్యవసాయ పంటలకు కషాయాలను స్వయంగా గిరిజన రైతులు తయారు చేసుకుంటున్నారు. రసాయన ఎరువులు, పురుగు మందులకు బదులుగా పంటలకు జీవామృతం, ఘనామృతం, బీజామృతం, ద్రవ జీవామృతం, పంచగవ్య, అగ్నాస్త్రం, బ్రహ్మాస్త్రం వంటి రసాయనాలను గిరిజన రైతులు స్వయంగా తయారు చేసుకుని పంటలకు వినియోగించుకుంటున్నారు.

క్లుప్తంగా

మాజీ మంత్రి కొట్టు పరామర్శలు



రామసుబ్బారావు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ మంత్రి కొట్టు

పెంటపాడు: మండలంలోని ముదునూరు గ్రామానికి చెందిన వైఎస్సార్ పార్టీ నాయకుడు బుద్దన రామసుబ్బారావు ఇటీవల మృతి చెందారు. బుధవారం మాజీ ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ వారి కుటుంసభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు బుద్దన వరప్రసాద్, కొప్పిశెట్టి రామకృష్ణ, మోఖమాట్ల బులిరాజు, తల్లా అబ్బులు, గ్రామ మాజీ ఉపసర్పంచ్ వడ్డి నాగసత్యనారాయణ, అడ్వకేట్ అద్దంకి విజయరత్నం తదితరులు పాల్గొన్నారు.

మహిళలను వేధిస్తే కఠిన చర్యలు



తిరుపతిపురంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి

అత్తిలి: పని ప్రదేశాల్లో మహిళలను లైంగికంగా వేధిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటారని ఐసీడీఎస్ తిరుపతిపురం సెక్టర్ పర్యవేక్షకురాలు ఎం శ్రీదేవి అన్నారు. తిరుపతిపురంలో బుధవారం జరిగిన మహిళా శక్తి కార్యక్రమంలో మాట్లాడారు. మెన్ స్ట్రువల్, హైజీన్, బ్రెస్ట్ క్యాన్సర్, గర్భాశయం క్యాన్సర్లపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం పి రత్నకుమారి, జీఎంఎస్‌కె దేవి, ఎంఎల్ హెచ్‌పీ ఎం సుగుణ, అంగన్‌వాడీ కార్యకర్తలు జి. పార్వతి, బి.లలిత, ఎస్.చంద్రిక, పి.మాధవి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

అభయ గణపతికి పంచామృతాలతో అభిషేకాలు



విశేష అలంకరణలో అభయ గణపతి

తాడేపల్లిగూడెం (టీఓసీ): భాద్రపద బహుళ (సంకష్టహర) చవితి పురస్కరించుకుని బుధవారం రాత్రి స్థానిక రామచంద్రరావుపేటలోని శ్రీకృష్ణ యోగ ధ్యాన మందిరంలో అభయ గణపతికి ఆలయ అర్చకులు ఇవటూరి శ్రీకాంత్ శర్మచే పంచామృతాలు, వివిధ ఫలరసాలు, సుగంధ ద్రవ్యాలతో ఏకాదశ అభిషేకాలు, సహస్ర నామాలు, వ్రతం జరిగాయి. దూర్వాంకురాలు, శ్వేతార్క పుష్పాలతో పూజలు, నూతన వస్త్రాలతో స్వామి వారికి విశేష అలంకరణలు జరిగాయి. మందిర కార్యదర్శి ఇందుకూరి మోహన్‌రావు పర్యవేక్షించారు.

బయోకల్చర్‌పై రైతులకు అవగాహన



అత్తిలి మండలం బల్లిపాడులో బయోకల్చర్‌పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

అత్తిలి: డ్రోన్ సాయంతో రసాయనిక బయోకల్చర్ పిచికారి విధానంపై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం బల్లిపాడు గ్రామంలో నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా కషాయాలు పిచికారి చేయాలని జోనల్ కోఆర్డినేటర్ గద్దె వెంకటరత్నం కోరారు. రైతు క్షేత్రంలో సామూహికంగా బయోకల్చర్ పాలింగువా, కోడిగుడ్డు, నిమ్మరసం పిచికారి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐసీఆర్పీ గంగా దర్, లక్ష్మి, కె.నాగలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

ఎలుకల నిర్మూలనకు కృషి చేయాలి



పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏవో రాజేంద్రప్రసాద్

తణుకు అర్బన్: తణుకు మండలం ముద్దాపురం, ఎర్రనీలిగుంట గ్రామాల్లో బుధవారం మండల వ్యవసాయ అధికారి కె.రాజేంద్రప్రసాద్ పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ ఈనెల 12వ తేదీన సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం నిర్వహించబడుతుందని, రైతు సోదరులుకు రైతు సేవా కేంద్రం వద్ద ఉచితంగా ఎలుకల మందును పంపిణీ చేస్తామని చెప్పారు. రైతులకు ఎరువుల వినియోగంపై సూచనలు, సలహాలు అందజేశారు. గ్రామ వ్యవసాయ సహాయకులు అయ్యప్ప, మల్లికార్జున్, జయరాం, సీతారాములు, రైతులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీపై కూటమి నిర్లక్ష్యం

- వెదజల్లుతున్న దుర్గంధం
- బిక్కుబిక్కుమంటున్న కాలనీ వాసులు
- పరిమెళ్లలో సమస్యల తిష్ట
- సమస్యలను పట్టించుకోని స్థానిక ఎమ్మెల్యే

పెంటపాడు: ఆ గ్రామం పేరుకు పరిమళం.. కానీ ఆ గ్రామం అంతా దుర్గంధం.. గత ఏడాదిన్నరగా గ్రామంతో పాటు, జగనన్న కాలనీలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎక్కడ చూసినా డ్రెయినేజీలు, రహదార్లపై మురుగు పొంగి ప్రవహిస్తున్నాయి. డ్రెయినేజీలు శుభ్రతలేక చెట్లు మొలుస్తున్నాయి. అయినా పాలకులు పట్టించుకోవడంలేదు. పరిమెళ్ల గ్రామంలో ప్రధానంగా చినకాపవరం కాలువగట్టును అనుకొని జగనన్న కాలనీలో సమస్యలు తిష్టవేసాయి. గ్రామ సమస్యలు పట్టించుకోని పాలకులు కాలనీ సమస్యలు కూడా గాలికి వదిలేశారు. ఫలితంగా అక్కడ నివసించే 70ఇళ్లవాసులు బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్నారు. కాలనీలో రహదారులు లేవు. కనీసం కచ్చా డ్రెయినేజీలు కూడా కానరావు. పేద ప్రజల సొంతింటి కల నెరవేర్చాలన్న ఆశయంతో ఏర్పాటు చేసిన కాలనీలు దుర్భరస్థితిలో ఉన్నాయి. చిట్టడవిలను తలపిస్తూ, మురికికూపాలుగా మారిపోతున్నాయి. దీంతో ఆయా కాలనీల్లో నివసిస్తున్న పేద కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పాలవుతున్నారు. రోడ్లు నిర్మాణాలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో మరుగునీరు ఇంటి ముందర నిలిచిపోయి దుర్వాసనలు వెదజల్లుతున్నాయి. ప్రణాళికాబద్ధంగా డ్రెయినేజీ నిర్మాణాలు చేపట్టకపోవడంతో ఎక్కడ మురుగు అక్కడే నిలిచిపోతుంది. దుర్వాసనలతో దోమల వృద్ధి చెందిన విషజ్వరాలకు దారితీస్తున్నాయంటూ కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలనీ అంతా చిట్టడవిని తలపించేవిధంగా గుబురు పొదలు ఏర్పడ్డాయి. దీంతో రాత్రి వేళల్లో కాలనీ వాసులు బిక్కుబిక్కు మంటూ జీవనం గడుపుతున్నారు. పాముల బెడద పెరిగిపోవడంతో రాత్రి వేళల్లో బయటకు రావాలంటే భయపడిపోతున్నారు. ఇదే పరిస్థితి అన్ని కాలనీల్లోనూ ఉందని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షం పడితే చాలు ఇంటినుంచి బయట అడుగు పెట్టే అవకాశం ఉండడంతో లేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు.



డ్రెయినేజీ, రహదారి సౌకర్యం లేక రాళ్లు రప్పలతో నిండిన జగనన్న కాలనీ రహదారి



పరిమెళ్ల జగనన్న కాలనీలో మోకాలి లోతు నీటిలో రహదారి

వైఎస్సార్ సీపీ హయాంలో పట్టాల పంపిణీ

అప్పటి ఎమ్మెల్యే కొట్టు సత్యనారాయణ వారికి వైఎస్సార్ ప్రభుత్వంలో సమీపంలోనే ఇంటి పట్టాలు అందజేశారు. జగనన్న ప్రభుత్వంలో వారికి ఎమ్మెల్యే కొట్టు సత్యనారాయణ ఇంటి పట్టాలతో పాటు, ఇళ్లు నిర్మించుకొనేందుకు కృషి చేశారు. అయితే జగనన్న పుణ్యమా అని గూడు ఏర్పాటు చేసుకున్నారు. అనంతరం వచ్చిన టీడీపీ ప్రభుత్వం ఆ కాలనీని పట్టించుకోలేదు. కనీసం తాగునీరు కూడా అందించలేని దుస్థితిలో ఉంది. కాలనీ మహిళలు సుమారు ఒక కిలోమీటరు దూరం వెళ్లి నీటిని తెచ్చుకుంటున్న సరే కూటమి ప్రభుత్వం కనికరించడం లేదు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ఆ కాలనీని పట్టించుకొని చర్యలు తీసుకోవాలని అక్కడి ప్రజలు కోరుతున్నారు.

తాగునీటి సౌకర్యం కల్పించాలి



తాగునీరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. వీధి కుళాయి కోసం అడిగితే సర్పంచ్ పట్టించుకోలేదు. ఇటీవల ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్‌కు కాలనీ వాసులం అంతా కలిసి వినతిపత్రం అందించాం. చర్యలు తీసుకొంటామన్నారు. పట్టించుకోలేదు. ఈలోగా వర్షం వల్ల మరింత ఇబ్బందులు పడుతున్నాం.

– అనూష, స్థానికురాలు

రోడ్లు బాగు చేయాలి



కూటమి ప్రభుత్వం తమను పట్టించుకోలేదు. రహదారులు లేవు. డ్రెయినేజీలు లేవు. మంచినీరు లేదు. రెండు కిలోమీటర్లు వెళ్లి తాగునీరు తెచ్చుకోలేక సమీపంలోని కాలవనీటినే తాగుతున్నాం. మా పిల్లలు జ్వరాలతో బాధడుతున్నారు. మా సమస్యలను ఎన్నోసార్లు విన్నవించినా ఫలితంలేదు. రెక్కాడితే కానీ డొక్కాడని మా బతుకులు బాగుచేయాలి.

– నక్కా వరలక్ష్మి, బాధితురాలు పరిమెళ్ల జగనన్న కాలనీ

పారిశుద్ధ్య కార్మికులకు వేతన బకాయిలు తక్షణమే చెల్లించాలి



సూపరింటెండెంట్ డాక్టర్ సాయికిరణ్‌కు వినతిపత్రం ఇస్తున్న భీమారావు, కార్మికులు

తణుకు అర్బన్: తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్టు పారిశుద్ధ్య కార్మికుల 3 నెలల వేతన బకాయిలు, 35 నెలల పీఎఫ్ బకాయిలు తక్షణమే చెల్లించాలని, ఆస్పత్రి 150 పడకల స్థాయికి అనుగుణంగా కనీసం ఏభై మందికి తగ్గకుండా పారిశుద్ధ్య కార్మికులను నియమించి కార్మికుల పనిభారం తొలగించాలని ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ తణుకు శాఖ అధ్యక్షుడు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కోనాల భీమారావు డిమాండ్ చేశారు. ఏపీ మెడికల్ కాంటాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం తణుకు జిల్లా కేంద్ర ప్రభుత్వాసుపత్రి ముందు నిరసన తెలిపి డిమాండ్స్‌తో కూడిన వినతిపత్రాన్ని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కాకర్లమూడి సాయి కిరణ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా భీమారావు మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులకు ఇస్తున్న అతి తక్కువ వేతనాలే నెలా నెలా సక్రమంగా ఇవ్వకపోవడంతో వారు పస్తులతో విధులు నిర్వహిస్తున్నారన్నారు. పీఎఫ్ సొమ్ము సైతం కార్మికుల పీఎఫ్ ఖాతాలకు జమ చేయడం లేదన్నారు.150 పడకల స్థాయి కనుగుణంగా పారిశుద్ధ్య కార్మికులు లేక తీవ్ర పనిభారంతో కార్మికులు అనారోగ్యాల పాలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ధర్మాని పుష్పలత, భారతి, సీహెచ్ మంగమ్మ, పి. విజయలక్ష్మి, మెండి శ్రీను, వెంకటలక్ష్మి, ఎం.బేబి, ఇ.హైమావతి, డి. శ్రీనువాసు, చింతాలు, డి. దంమూరు పాల్గొన్నారు..

మానసిక ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



సైక్రియాట్రిస్టు డాక్టర్ శంకర్ రెడ్డిని సన్మానిస్తున్న కళాశాల సిబ్బంది



తణుకు ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాలలో సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ రమేష్‌కుమార్

పెంటపాడు: ప్రజలు శారీరక ఆరోగ్యంతో పాటు, మానసిక రుగ్మతల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని ప్రముఖ సైక్రియాటిస్టు డాక్టర్ శంకర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ప్రత్తిపాడు ఏఎస్ఆర్ హోమియో మెడికల్ కళాశాలలో ప్రపంచ ఆత్మహత్యల నిరోదక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిధిగా పాల్గొన్న ఆయన విద్యార్థులతో ప్రత్యేక సెమినార్ నిర్వహించారు. ప్రతి ఒక్కరిలోనూ డిప్రెషన్, ఒత్తిడి, నిరాశ వంటి సమస్యలు సాధారణమయ్యాయన్నారు. దీని వల్ల ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది మంది వ్యక్తులు అత్మహత్యలకు లోనవుతున్నారన్నారు. ఈ సమయంలో బాధితులు స్నేహితులు, కుటుంసభ్యుల సాయం తీసుకోవడంతో పాటు, మానసిన వేత్తను కలవడం, సరైన జీవన విధానం అలవరచుకోవడం చేయాలన్నారు. తద్వారా ఆత్మహత్యలకు ముగింపు పలకవచ్చన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

తొందరపాటు నిర్ణయాలతో ఆత్మహత్యలు

తణుకు అర్బన్: ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా స్థానిక ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాలలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఉమెన్ డెవలప్‌మెంట్ సెల్, జాతీయ సేవాపథకం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన న్యూరో సైక్రియాటిస్ట్ డాక్టర్ బి.రమేష్‌కుమార్ మాట్లాడుతూ పలు సమస్యల్లో తొందరపాటు నిర్ణయాలతో అనేకమంది ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. కుటుంబ కలహాలు, రుణ బాధలు, శారీరక, మానసిక ఆరోగ్య సమస్యలతో పాటు ప్రేమ, పోటీ పరీక్షల్లో విఫలం, ఉద్యోగాల్లో తీవ్ర ఒత్తిడి వంటి కారణాలతో అనేకమంది ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని స్పష్టం చేశారు. ఎంతటి సమస్యలు ఉన్నా పాజిటివ్ ఆలోచనలు కలిగి ఉండేలా ప్రతి ఒక్కరూ ఆచరించాలని, ధైర్యంగా సమస్యలను ఎదుర్కొనాలనే ఉద్దేశ్యంతో మెలగాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపల్ యు.లక్ష్మీసుందరీబాయ్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉమెన్ డెవలప్‌మెంట్ సెల్ కన్వీనర్ వి.తులసీరత్నం, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ సీహెచ్ రమేష్, కేవీ శ్యామలాదేవి, సైకాలజిస్ట్ వి.ధనశేఖర్, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

పరిశ్రమలను సంక్షోభం నుంచి ఆదుకోవాలి



తణుకులో సమావేశంలో మాట్లాడుతున్న డీవీవీఎస్ వర్మ

తణుకు అర్బన్: రాష్ట్రంలో వివిధ కారణాలతో సంక్షోభం కారణంగా మూతపడుతున్న టెక్స్ టైల్స్, స్పిన్నింగ్ మిల్స్ పరిశ్రమలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆఫ్ శ్రీ అక్కమాంబ టెక్స్ టైల్స్ అధ్యక్షుడు డీవీవీఎస్ వర్మ కోరారు. అక్కమాంబ టెక్స్ టైల్స్ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఎఐటీయూసీ) కార్యవర్గ సమావేశం బుధవారం యూనియన్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2 లక్షల మందికి ఉపాధి కల్పిస్తున్న టెక్స్ టైల్స్, స్పిన్నింగ్ పరిశ్రమలకు చెల్లించాల్సిన రాయితీల బకాయిలు వెంటనే చెల్లించి పరిశ్రమలు మూతపడకుండా కాపాడాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఇస్తున్న యూనిట్ కరెంట్ మీద 2 రూపాయిల రాయితీని, ఆంధ్రప్రదేశ్‌లో కూడా అమలు చేయాలని కోరారు. కొత్త పరిశ్రమలకు రాయితీల వర్షం కురిపిస్తున్న ప్రభుత్వం లక్షలాది పేదలకు ఉపాధి కల్పించే ఈ పరిశ్రమల రక్షణకు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. యూనియన్ ఉపాధ్యక్షుడు కోనాల భీమారావు మాట్లాడుతూ స్థానిక అక్కమాంబ టెక్స్ టైల్స్ మిల్లులో పని చేస్తున్న కార్మికులకు ప్రతి నెలా జీతాలను 7వ తేదీ లోపు చెల్లించడానికి యాజమాన్యం తగిన చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు, యూనియన్ ఉపాధ్యక్షుడు కోనాల భీమారావు కోరారు. ఆర్థిక ఇబ్బందుల సాకుతో పని చేసిన కాలానికి జీతాలు సకాలంలో చెల్లించకపోవడంతో కార్మికులు ఇంటి అద్దెలు, పిల్లలు స్కూల్ ఫీజులు, బ్యాంకుల ఈఎంఐలు సకాలంలో చెల్లించక అధిక వడ్డీల భారంతో సతమతమవుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి చిక్కాల దుర్గాప్రసాద్, ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శి ఫణీంద్ర, యూనియన్ నాయకులు రమేష్, ఇ.రేమేష్, దేవ పెద్దిరాజు, పుచ్చకాయల భాస్కరరావు, తోరాటి శ్రీను, వట్టికూటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్‌కు నష్టపరిహారం ఇవ్వాలి

తణుకు అర్బన్: ఆత్మహత్యకు యత్నించిన తణుకు మండలం వేల్పూరుకి చెందిన ఆటో డ్రైవర్ కోల రాంబాబు కుటుంబానికి ప్రభుత్వం రూ.5 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలని ఆటో అండ్ ట్రాలీ కార్మికుల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్త్రీ శక్తి పథకంలో భాగంగా ప్రభుత్వం ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచితం చేయడంతో ఆటో డ్రైవర్లు కిరాయిలు లేక ఫైనాన్స్‌లు చెల్లించలేక మంగళవారం ఆత్మహత్యకు యత్నించాడన్నారు. తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రాంబాబును బుధవారం వారు పరామర్శించారు. ఆటో యూనియన్ తణుకు ఏరియా అధ్యక్షుడు పంగం రాంబాబు మాట్లాడుతూ పథకాలు పెట్టేముందు ప్రభుత్వం ఆలోచించాలని, ఓట్ల రాజకీయంతో ఆటో కార్మికుల పొట్ట కొట్టరాదని అన్నారు. ఆటో కార్మికులు సమస్యలు పరిష్కారం కోసం ఉద్యమాన్ని నిర్వహిస్తామని, ప్రభుత్వం పరిష్కరించని పక్షంలో చలో అసెంబ్లీ కార్యక్రమానికి వెనకాడబోమని స్పష్టం చేశారు. ఆటో యూనియన్ కార్యదర్శి విశ్వేశ్వరరావు, కామన మునిస్వామి పాల్గొన్నారు.

ఐలమ్మ జీవితం ఆదర్శనీయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): తెలంగాణ పోరాట యోధురాలు, రజక జాతి వీరనారీ ఐలమ్మ జీవితం ఆదర్శనీయమని పలువురు వక్తలు కొనియాడారు. తాడేపల్లిగూడెం రజక సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నవ్యాంధ్రప్రదేశ్ రజక సంఘం అధ్యక్షుడు అద్దాల నరసింహారావు, రజక చైతన్య సేవా సంస్థ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జొన్నాడ శ్రీనివాస్, రజక జన సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు యండమూరి మహేష్‌లు మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాడి, తెలుగు ప్రజల తెగువను ప్రపంచానికి చాటిని వీరవనిత ఐలమ్మ అని వెల్లడించారు. పడాల జీవన సంధ్య వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉభయ జిల్లాల రజక చైతన్య జిల్లా అధ్యక్షులు దువాపు శ్రీనివాస్, తణుకు మండలం అధ్యక్షుడు వెలుదుటి శ్రీనివాస్, ఇరగవరం మండలం అధ్యక్షుడు పాలమూరి అన్నవరం, గూడెం నియోజకవర్గ అధ్యక్షుడు బోగెల్లి రాంబాబు పాల్గొన్నారు.

అత్తిలి స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్ట్ పునరుద్ధరణ

అత్తిలి: ఐదు సంవత్సరాలు అనంతరం అత్తిలిలో బుధవారం సాయంత్రం సర్కార్ ఎక్స్‌ప్రెస్ ఆగడంతో ప్రయాణికులు, స్థానిక నాయకులు అత్తిలి రైల్వే స్టేషన్ వద్ద ఘన స్వాగతం పలికారు. రైల్వే స్టేషన్‌కి చేరుకున్న గ్రామస్థులు ఆనందాన్ని వ్యక్తం చేస్తూ రైల్వేవారికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా బిజెపి అధ్యక్షురాలు అయినంపూడి శ్రీదేవి మాట్లాడుతూ కరోనా అనంతరం అత్తిలిలో ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగకపోవడంతో ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేశారని అన్నారు. కేంద్రమంత్రి భూపతి రాజు శ్రీనివాసవర్మను ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆపాలంటూ చేసిన విజ్ఞప్తి మేరకు రైల్వే అధికారుల స్పందించి మొదటిగా పూరి-తిరుపతి, సర్కార్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగేలా ఉత్తర్వులు ఇచ్చారని తెలిపారు. ఈసందర్భంగా అత్తిలి స్టేషన్‌కు చేరుకున్న సర్కారు ఎక్స్‌ప్రెస్‌కు ఆమె జెండా ఊపి ప్రారంభించారు.

మహిళా అభివృద్ధికి కృషి చేద్దాం



మాట్లాడుతున్న సీడీపీఓ టీఎల్ సరస్వతి

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్త్రీలు, పిల్లలు అభివృద్ధికి విశేషంగా కృషి చేద్దామని సీడీపీఓ టి.ఎల్.సరస్వతి అన్నారు. స్థానిక డీఆర్ గోయెంక ఉమెన్స్ కళాశాలలలో బుధవారం మిషన్ శక్తి, మిషన్ వాత్సల్యలో భాగంగా చిల్డ్రన్ అభివృద్ధి, స్త్రీలు ఉన్నతికి చేయాల్సిన వివిధ కార్యక్రమాలపై కళాశాల విద్యార్థినులతో పాటు మూడు మండలాల అంగన్‌వాడీలు, ఆయాలు, టీచర్స్‌కు అవగాహన కార్యక్రమం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. సరస్వతి మాట్లాడుతూ 2వ తేదీ నుంచి 10వ తేదీ వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహిళా సాధికారత, చిల్డ్రన్ డవలప్మెంట్‌లపై చర్చించారు. వన్ స్టాప్ సెంటర్స్‌లో స్త్రీలకు సంబంధించి ఆరు రకాల సేవలు అందిస్తారని తెలిపారు. ప్రజ్వల హోం మిషన్ కోఆర్డినేటర్ శ్రావ్య మాట్లాడుతూ స్త్రీల చట్టాలపై, స్త్రీలు ఎదుర్కొంటున్న సమస్యలపై తెలియజేశారు. వెంకట్ మాట్లాడుతూ అంగన్‌వాడీలు ప్రీస్కూల్ నిర్వహించాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ గణపతిరామ్, ఏసీడీఎస్ సూపర్‌వైజర్స్ సీహెచ్ దుర్గా భవాని, విశాలాక్షి, సుజాత, విజయలక్ష్మి, శ్రీదేవి, ఎస్తేర్ రాణి, చంద్రావతి, విద్యార్థులు పాల్గొన్నారు.

నాసిరకం చిరుతిళ్లు.. ఆరోగ్యానికి చేటు

- చిన్నారులే లక్ష్యంగా తయారీ
- ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ
- నాణ్యతా ప్రమాణాలు పాటించని తయారీదారులు



రేలంగి షాపులో అమ్ముతున్న చిరుతిళ్లు



ఇరగవరం షాపులో వివిధ రకాల ప్యాకెట్స్‌లో ఉన్న చిరుతిళ్లు

ఇరగవరం: మార్కెట్‌లో కొనుగోలు చేసే నాశిరకం చిరుతిళ్ల వలన ప్రజారోగ్యానికి భంగం వాటిల్లుతుందని వైద్యాధికారులు సూచిస్తున్నారు. పలురకాల చిరుతిళ్లు తయారు చేసే నాసిరకం బ్రాండ్లను గతంలో ప్రభుత్వం నిషేదించిన సందార్భాలున్నాయి. చిరుతిళ్ల విక్రయాలపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో నాణ్యతలేని ఆహార పదార్థాలు నియోజకవర్గంలోని గ్రామాల్లో విజృంభిస్తున్నాయి. ఆకట్టుకునే కార్టూన్లు, రంగుల ప్యాకింగ్‌లతో కిళ్లీషాపులు, కిరణా షాపులు, బేకరీల వద్ద ఇవి దర్శనమిస్తున్నాయి. వీటిని చూడగానే కొనివ్వాలని చిన్నారులు మరాం చేస్తున్నారు. తప్పని పరిస్థితిల్లో తల్లిదండ్రులు కొనుగోలు చేసి ఇవ్వడం పరిపాటిగా మారుతోంది. నాణ్యతా ప్రామాణాలు పాటించకుండా తయారు చేసే చిరుతిళ్లను తింటే చిన్నారుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని వైద్యులూ హెచ్చరిస్తున్నారు. వీటి అమ్మకాలు ఇలాగే జరిగితే భవిష్యత్తులో ప్రజారోగ్యానికి పెనుముప్పు తప్పదని వైద్యాధికారులు హెచ్చరిస్తున్నారు.

నకిలీ చిరుతిళ్లతో రూ.లక్షల్లో వ్యాపారం


ఈ చిరు తినుబండారాలే ప్రమాదమనుకుంటే అసలును పోలిన నకిలీలు గ్రామాల్లో హల్చల్‌చేస్తున్నాయి. ధనార్జనే లక్ష్యంతో అక్రమంగా కొంతమంది బ్రాండ్లను పోలిన నకిలీ చిరుతిళ్లను తయారుచేసి ఆకర్షణీయమైన ప్యాకింగ్‌లలో మార్కెట్‌లోకి వదులుతున్నారు. ఈ స్నాక్స్ చిరుతిళ్ల ప్యాకింగ్‌లపై పరిశ్రమ చిరునామా, తయారీ తేదీ, వాడిన పదార్థాలు తదితర వివరాలేవీ ఉండవు. ప్రముఖ కంపెనీలను పోలి ఆకర్షణీయంగా ప్యాకింగ్ ఉండటం, మార్జిన్ తక్కువగా ఉండటంతో స్వలాభం కోసం వ్యాపారులు, షాపు యజమానులు వీటి అమ్మకాలనే ప్రోత్సహిస్తుంటారు. జిల్లా వ్యాప్తంగా నాశిరకం చిరుతిండ్ల వ్యాపారం రోజుకు రూ.లక్షల్లో ఉండవచ్చని నిపుణుల అంచనా. గతంలో హైదరాబాద్, విజయవాడ తదితర ప్రాంతాలనుంచి దిగుమతయ్యే ఈ నకిలీ తినుబండారాలు ఇటీవల స్థానికంగా జిల్లాలోనే తయారవుతున్నాయని పలువురు వ్యాపారులు చెబుతున్నారు.

పూర్తిగా నిషేధించాలి

పిల్లలకు ప్రమాదకరమైన చిరుతిళ్లు ఇవ్వడం పూర్తిగా నిషేధించాలి. రెడీమెడ్ స్నాక్స్ వలన కలిగే అనారోగ్యాలు ప్రమాదాలను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లలకు వివరించాలి. ఆకర్షణీయమైన ప్యాకింగ్‌లను చూసి పిల్లలు అవేకావాలని మారాం చేస్తే తల్లిదండ్రులు సహజ సిద్ధమైన పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలు, పండ్లు, కాయలు ఇచ్చి వారి దృష్టిని మళ్లించాలి.

– రవీంద్ర, రేలంగి హైస్కూల్, ప్రధానోపాధ్యాయుడు

నకిలీకి దూరంగా ఉండాలి



మార్కెట్‌లో అమ్ముడుపోయే చిరుతినుబండారాలు, జంక్ ఫుడ్‌లకు ప్రజలు దూరంగా ఉండాలి. రుచి, నిల్వ కోసం వీటిలో ఉపయోగించే రసాయనాలు, రంగుల వలన కడుపునొప్పి, అజీర్తితో పాటు భవిష్యత్తులో జీర్ణకోశ సమస్యలు, కిడ్నీ వ్యాధులు, పేగు సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. ఈ చిరుతిళ్ల విషయంలో పిల్లలు, పెద్దలు జాగ్రత్తగా ఉండాలి.

– డాక్టర్ బంగారు రవి, టీహెచ్, తణుకు